# ఏనాటి జగన్నాథ్?

తెల్లారగట్ట నాలుగు కొట్టింది. ఆకాశం వెలా తెలా పోతోంది. వేగుచుక్క ప్రకాశంతో మెరుస్తోంది. కొంచెం కొంచెం చలి. గోదావరి గాలి మందంగా వీస్తోంది. గాలి ఊపుకు తురాయిచెట్టు కదిలి మంచు బిందువులు రుక్మిణమ్మ తలమీద పడుతున్నాయి. తలమీద మఫ్లరు బాగా సద్దుకుంది.

“రావద్దంటే విన్నావు గాదు. ఈ చల్లగాలి నీ ఆరోగ్యానికి పడదు” అంటున్నాడు భర్త గోపాలరావు, లేనికోపం కంఠంలోకి తెచ్చుకుంటూ.

రుక్మిణమ్మ సమాధానం చెప్పకుండా సన్నగా, నీరసంగా నవ్వింది.

“చిట్టి బట్టలూ, అవీ జాగ్రత్తగా సద్దండి. నేకొత్త స్వెట్టరు అల్లేదాకా ఆపాతదే తొడుక్కో చిట్టి” అంది పన్నెండేళ్ల పిల్లాడితల నిమురుతూ.

చిట్టికి అమ్మమాటలు వినిపించడంలేదు. దూరానవున్న సిగ్నలు దీపాలను వుత్సాహంతో చూస్తున్నాడు.

పాపం, వాడికేం తెలుసు తనబాధ? రైలెక్కి పట్నం వెడుతున్నాననే సంబరమే గాని—అమ్మ తనని వదల్లేకుండా వుందని ఆ చిన్న బుర్రకు ఎలా తెలుస్తుంది?

ఇంతలో రైలు ప్లాట్ ఫారమ్‌మీద కొచ్చింది.

“నాన్నగారూ పెట్టెలో ఎక్కి కూచుందామా?” అన్నాడు కుర్రాడు.

“అలాగేపద నువ్వు మటుకీమంచులో ఎందుకు? లోపల కూచుందాము యింకా టైముందిగా!” అంటూ భర్త రెండడుగులు వేశాడు.

చిట్టికి ఎదురుగ్గా బల్లమీద కూచుని వాడివంక తదేకంగా చూస్తోంది. వాడిపక్క కూచున్న భర్త తనవంక దయగా నవ్వుతూ చూస్తున్నారు.

"నాన్నా, రోజూ రెండుపూటలా పాలు తాగుతూండూ" అంటోంది రుక్మిణమ్మ.

తల్లిమాటలు వినిపించుకోకుండా "నాన్నగారూ ఆకుపచ్చ రెక్క వాలినా రైలు కదలలేదేం?" అని ప్రశ్నిస్తున్నాడు.

తల్లికి కష్టం వేసింది. భర్త గ్రహించుకున్నట్టుగా "నేను మేట్రిన్‌తో చెప్పి అన్ని ఏర్పాట్లూ చేస్తాను. నువ్వు ఏమీ ఆదుర్దా పడకూడదు. మనసు ప్రశాంతంగా వుంచుకుని మందు తింటేనే వంటబడుతుంది. నీకోసం నాలాంటి మానవుడు అహర్నిశలూ కాచుకు కూచుంటాడని దేవిగారు కాస్త జ్ఞాపకం వుంచుకోండి" అన్నాడు చిలిపిగా నవ్వుతూ.

పాపం, వారికి తనమీద, ఎంత ప్రేమో! ఎప్పుడూ కొంగు విడువకుండా తిరిగే ఆయన, యిప్పుడు వొంటిగా ఎలా వుంటారో? అందులో చిట్టిలేడు, తనులేదు–అనుకుంటూ భర్తవంక దయగా చూసింది.

చిట్టి తండ్రిని ఏవేవో అడుగుతున్నాడు. వాడికి తల్లిబాధపడుతోందని కాస్తకూడా తట్టడంలేదు. చిన్నతనం. వాడినిగురించి తనమనసు ఎందుకలా కొట్టుకోవాలి? మరీ అంత ఏవస్తువునీ ప్రేమించగూడదు.

"చిట్టీ, వుత్తరాలు రాస్తుంటావా? కొంచెం తలనొప్పి అదీ వస్తే నాన్నగారికి వైర్ యిప్పించు. వెంటనే వస్తారు. ఏంబాబూ" అంది తిరిగి రుక్మిణమ్మ.

"అలాగేలేవే" అని, యింకా రైలు కదలలేదేం?" అంటున్నాడు తండ్రివైపు తిరిగి కుర్రాడు.

"బెల్ కొట్టారు–నువ్వుదిగు" అన్నాడు భర్త.

చిట్టి తలని గుండెలకి హత్తుకుంది. వాడిజుట్టులో తల్లి కన్నీటిబొట్లు చిక్కుకున్నాయి. "జాగ్రత్త, నాన్న ఉత్తరాలురాయి" అంటూ దిగింది రుక్మిణమ్మ.

భర్త తనతోపాటు కిందికి దిగి "నీ ఆరోగ్యం జాగ్రత్త. మళ్ళీ శుక్రవారం రాత్రికొస్తాను. చిన్నతనం, వుత్సాహంవల్ల వాడు అల్లా

వున్నాడుగాని రేపటినుంచి, అమ్మ లేదని వాడుమటుకు దిగులుపడడూ! యిటు చూడు" అన్నాడు కన్నీటితో నిండిన ముఖాన్ని పైకెత్తి. వేళ్ళ కొనలతో కన్నీటిని తుడుస్తూ "పిచ్చిదానా!" అంటూ బుజాలునొక్కి కంపార్టుమెంటులోకి ఎక్కాడు భర్త.

రైలుకు చెరోకొసనీ ఆకుపచ్చ దీపాలు వూగుతున్నాయి. చిట్టి దూరానవున్న సిగ్నల్ దీపాల్ని తదేకంగా చూస్తూ కూచున్నాడు. భర్త రుక్మిణిచేతిని ప్రేమతో మృదువుగా నొక్కుతున్నాడు.

రైలు కదిలింది. రుక్మిణమ్మ కొడుకువైపుచూసి చెయ్యి వూపింది. వాడు పరుగెత్తే యింజనుసంక తొంగి తొంగి చూస్తున్నాడు. దూరమయ్యే భర్తముఖం దీపాల వెలుగులో, కన్నీటితో మెరిసినట్టు అగుపించింది రుక్మిణమ్మకు. రైలు బ్రిడ్జిమీదకు జారిపోతోంది. చిట్టి నల్లని జుట్టు, వాడి మెడ, కాలర్ అగుపిస్తున్నాయి. వాడిముఖం కనపడటం లేదు. భర్త రుమాలు వూపుతున్నాడు.

రైలు వెళ్లిపోయింది. కాకులు కావుకావున కూస్తున్నాయి. కాళ్లల్లో శక్తిపోయినట్టు రుక్మిణమ్మ అక్కడే కూర్చుండిపోయింది.

"అమ్మగారూ లేవండి. ఈ మంచులో ఉంటే మళ్లీ దగ్గొస్తుంది..." అంటున్న వెంకమ్మ మాటల్తో నిద్దట్లోలా నడిచింది స్టేషనులోకి. యిద్దరూ జట్కా ఎక్కారు.

కదలిపోతున్న రైలు, చిట్టిమెడ కాలరు, యింకా ఆమె కళ్ళల్లో మెదులుతూనే వున్నాయి. వాడు తన ప్రేమనీ, బాధనీ అర్థంచేసుకోకుండా కొత్త ప్రపంచంలోకి ఉత్సాహంగా పరుగెడుతున్నాడు. ఆ దృశ్యం తలుచుకుంటే చిన్నప్పుడు తనూ యిలా రైల్లో వెనక్కి చూడకుండా, ముందుకే అమ్మావాళ్ళనీ చూస్తాననే వుత్సాహంతో — వెనక తనకోసం కన్నీరు కారుస్తున్న జగన్నాథ్‌ని తిరిగన్నా చూడకుండా రావడం జ్ఞాపకంవచ్చింది. ఆనాడు అతనూ యిలాగే బాధ పడ్డాడా? అతను యిలా బాధపడి వుంటాడని తనకి యీనాటిదాకా తట్టనేలేదు, పాపం!

తనకి అప్పటికి యించుమించు చిట్టి యీడే వుంటుంది. బావగారికి నైజామ్‌లో పని. అక్క కాపరానికి వెళ్లిన మరుసటి సంవత్సరంలో, దానికి వంట్లో బాగాలేకపోతే తనకి సాయంగా వెంటపంపారు, అమ్మా వాళ్ళు.

నైజాముమ్‌లో, మారుమూల వుస్మానాబాద్‌లో, హైస్కూలు హెడ్‌మాష్టరుగా వుండేవారు బావ. అంతా మరాఠీ, ఉరుదూ, తెలుగు వాళ్ళు ఒక్కరుకూడా లేరు. అక్క వచ్చీరాని మరాఠీతో కాలక్షేపం చేసేది. బావగారికి స్కూలు. ఎటొచ్చీ మిగిలింది తను. ఆడుకునేందుకు పిల్లలు లేరు బయటకెళ్తే భాషరాదు. వారంరోజులదాకా అరణ్యంలో వున్నట్టుంది రుక్మిణికి.

ఆవేళ ఆదివారం. సాయంత్రం అక్క కూర తరుగుతూ, బావగారితో "జగన్నాథ్ బాడ్సీనుంచి ప్రొద్దుట వచ్చాడుట. బాసుందీపాత్రా, యాపిలూస్, ఓవల్టిన్ తెచ్చివుంటాడు. కాస్సేపట్లో రావచ్చు. అతనొస్తే కాస్త రుక్మిణికి కాలక్షేపం అవుతుంది" అంటోంది.

కాగితంతో కుంపటి అంటించలేక తిప్పలు పడుతున్న రుక్మిణి "ఏం లాభం. భాషొచ్చా, పాడొచ్చా—యీ వూళ్లో ఎంతమంది వుంటే ఏం?" అంది.

"అతనికి కొంచెం తెలుగు వచ్చునే" అని అక్క అంటూంటే జగన్నాథ్ వచ్చి గుమ్మంలో నిలబడ్డాడు.

బావగారికీ, అక్కకీ నమస్కారం చేశాడు.

ఆ క్షణంలో రుక్మిణికి జగన్నాథ్‌కంటే అతను తెచ్చిన యాపిలూస్, బిస్కట్లూ, జామపళ్లూ బాగున్నాయి. అక్కయ్య జదన్నాధ్‌కి తన చెల్లె పేరు చెప్పింది. అతను నోటారా నవ్వాడు. తెల్లని పళ్ళు తళుక్కున మెరిశాయి.

కాసేపవున్నాక అక్క ఆజ్ఞప్రకారం జగన్నాథ్ రుక్మిణిని వూరు చూపించేందుకు తీసుకెళ్ళాడు. బావగారు క్లబ్‌కి వెళ్ళిపోయారు. ఆనాటి నుంచి జగన్నాథ్ రుక్మిణికి ఒకవిధమైన బానిస అయ్యాడు. రుక్మిణికి సీమచింతకాయలు కొట్టితేవడం, జామపళ్ళు తెచ్చిపెట్టడం. అక్కకూ వాళ్ళకూ తెలియకుండా వేరుసెనక్కాయలు పెట్టడం యిలాంటిడ్యూటీల్లో పడ్డాడు

జగన్నాథ్ పచ్చగా, పల్చగా వుండేవాడు. ఎప్పుడూ నవ్వుతూ ఆడుతూ వుండేవాడు. ఏనాడూ అక్కావాళ్ళింటికి వీథిదారిన వచ్చినపాపాన పోలేదు. ముందుగదిలో బావగారుంటారని, వంటింటివైపునుంచివచ్చి వెనక

గదిలో కూచునేవాడు. అక్క రుక్మిణికి పనిపురమాయిస్తే, రుక్మిణి జగన్నాథ్‌కి వొప్పజెప్పేది. వొచ్చీరాని తెలుగూ, కొసిని మరాటీ, ఇంగ్లీషు ముక్కల్తో యిద్దరూ ఏదో వాగుతూండేవారు. ఆఖరికి వారిద్దరి భాషా అక్కకికూడా అర్థంఅయేది కాదు.

సాయంత్రం అయిదు అయ్యేవేళకి జగన్నాథ్ వంటింటి గుమ్మంలో హాజరయేవాడు. బావగారు క్లబ్‌నుంచి వచ్చేదాకా - ఏ కార్లషెడ్‌వైపో, పాపనాశనం గుహావైపో, ఫ్యాక్టరీవైపో రుక్మిణిని తీసుకెళ్తూండేవాడు.

సంతరోజున తనతరఫున జగన్నాథ్ అక్కని ఒప్పించి రుక్మిణిని సంతకుతీసుకెళ్తూండేవాడు. అక్కడకడుపునిండా జామపళ్లు అవీ తిని, తెల్లవారిబాధపడ్తే డాక్టరు దగ్గరకు పరుగెత్తడంకూడా అతనివంతే. పాపం, ఆరోజుల్లో రోజుకి పదిసార్లన్నా అతనిమీద ఇసుక్కునేది. మళ్ళీ అతనే బతిమిలాడుకుంటూ వచ్చేవాడు.

ఆరునెలలు గిర్రున తిరిగాయి. వేసంగి శెలవలిచ్చారు. అమ్మావాళ్ళనీ చూడవచ్చుననే వుత్సాహంలోవుంది రుక్మిణి. జగన్నాథ్ ఏదో దిగులుగా వుండేవాడు. ఈ నాటికీ తనకి జ్ఞాపకం. అక్కయ్య "అతన్నికాస్త వోదార్చవే - పాపం, నువ్వు వెళ్ళిపోతున్నావని దిగులుపెట్టుకున్నాడు" అనేది.

తను నిర్లక్ష్యంగా నవ్వేది.

అవ్వాళ మధ్యాహ్నం సామానంతా సద్దుతున్నారు. బావగారు ముందుగదిలో పేపర్లు దిద్దుతున్నారు. అక్కవంటింట్లో మర్నాటి ప్రయాణానికి పిండివంటలు తయారుచేస్తోంది. జగన్నాథ్ హోల్డాలు కట్టుతున్నాడు. పక్కన తనుకూర్చుని సాయంచేస్తోంది. కడుతున్నవాడల్లా చటుక్కునఆగి, తనచెయ్యిపట్టుకుని. ఆడపిల్లలా కన్నీళ్ళు విడవడం మొదలెట్టాడు. తనకి నవ్వొచ్చింది.

"నన్ను మర్చిపోతావా ?" వచ్చీరాని తెలుగులో అడిగాడు.

"వుత్తరాలు రాయవూ ?" అన్నాడు మళ్ళీ

"చూద్దాంలే" అని చెయ్యివిడిపించుకుని అక్కని తీసుకొచ్చి చూపించింది, ఫక్కున నవ్వుతూ.

అక్క తనని నాలుగు చీవాట్లు వేసింది. అలా చూపించడం తప్పని అంది. బావగార్ని పిలవబోతే ఆపింది. జగన్నాథ్ కన్నీళ్ళు తుడుచుకుని కోపంతో వెళ్ళిపోయాడు,

ఈనాడు రుక్మిణమ్మకు అర్థం అవుతోంది. ఛీ! తనెంత పాడుపని చేసింది. అతనెంత బాధపడివుంటాడో! పాపం ఎందుకు అలా అక్కని తీసుకొచ్చి చూపించాలి.

* * * * *

కన్నీళ్ళు జలజల రాలిపోతున్నాయి. జట్కా టకటక పరుగెత్తోంది. పాల కావిళ్ళు పక్కనుంచి వెళ్ళిపోతున్నాయి.

"ఎందుకమ్మా అలా కన్నీళ్ళెట్టుకుంటారు? చిట్టిబాబుగారు హాయిగా చదువుకుని పెద్దావారు అవుతారు" అంటోంది వెంకమ్మ.

* * * *

మళ్ళీ ఆసాయంత్రందాకా జగన్నాథ్ కనబడలేదు. అక్క తనని తిడుతూనేవుంది.

అతను తనని పట్టుకు పాకులాడటంవల్ల తనకి పొగరెక్కిందని కేక వేసింది. దీపాలు పెట్టేవేళ జగన్నాద్ మళ్ళీవచ్చాడు. అక్క తనని పిలిచి "యిప్పటికన్నా బుద్ధి తెచ్చుకుని అతనిని వూరికే ఏడిపించకు పరీక్షలనక, పాడనక నీవెంట తిరుగుతూవుంటే — నువ్వు చేసేది హేళనా? అలా బజారు కెళ్ళి కూరలు తెండి" అని సంచి యిచ్చి యిద్దర్నీ పంపింది.

దారిలో అతనడిగాడు "అక్కని తీసుకొచ్చి ఎందుకు చూపించావ్?" అని

"ఏం చూపిస్తే?"

"నేను ఏడుస్తుంటే నీకు హేళనగా వుందా? నాబాధ నీకేం తెలుసుండి? నువ్విలా మీ అక్కగార్ని తీసుకొచ్చి చూపిస్తావనుకోలేదు" అన్నాడు, బొంగురు గొంతుకుతో.

అక్కకీ, అతనికీ తప్పని తోచింది. తనకెందుకు తోచలేదు? ఈనాటిదాకా తనుఅలా అక్కని తీసుకొచ్చి చూపించడం తప్పని తట్టనేలేదు.

"నీదగ్గిరున్న పట్టుగళ్ళ రుమాలు నాకుయివ్వవూ? జ్ఞాపకంగా వుంచుకుంటా?" అన్నాడు.

"అక్కనడిగి యిస్తా"

"అయితే వద్దులే."

"ఏం?"

"మీ అక్కగారి దాకా యీ మాట వెళ్ళనక్కరలేదు. నీకు ఇవ్వాలనివుంటే యియ్యి"

"ఆ తరువాత రుమ్మాలుపోయిందని అక్కతిడితే?"

"ఆమాత్రం నాకోసం తిట్లుపడలేవా?"

అతనికోసం తిట్లెంకుకు పడాలి అనిపించింది. ఆక్షణంలో పాపం-అనికూడా జాలిపుట్టలేదు. అక్కకి తెలియకుండా యిమ్మనడంలోని గూఢార్థంకూడా తెలీలేదు.

అతను తనవాళ్ళు తనసూక్కలం గురించి మాట్లాడుతుంటే యింటికొచ్చేశాము.

ఆరాత్రి అక్కనడిగింది రుమ్మాలు యివ్వనాఅని. ఇమ్మనమంది. తనను అడిగినట్లు జగన్నాద్‌తో చెప్పవద్దంది అక్క.

మర్నాటి పొద్దున అతను రాగానే రుమ్మాలు యిచ్చింది. తనను పక్కకు తీసుకెళ్ళి జడలో బంగారపు నారుపోసిన స్ప్రింగ్ చామంతి పువ్వు గుచ్చాడు.

అది స్ప్రింగ్‌తో ఎగురుతోందనేకాని అతనెంత కష్టపడి ప్రేమతో తెచ్చాడో తనకి అర్థం అవలేదు.

సాయంత్రం రయిలువేళయింది. అందరూ ప్లాట్‌ఫారమ్‌మీద నిల్చున్నారు.

"వుత్తరాలు రాయవూ?" అన్నాడు దీనంగా.

"ఎందుకూ?"

"నా కోసం."

"చూద్దాంలే."

"నీకిప్పుడు తెలియదులే పెద్దయిన తర్వాత ఒకరోజున నాకుమల్లే నువ్వూ బాధ పడ్తావ్" అన్నాడు శపిస్తున్నట్టు.

రైలు కదులుతోంది అతనివంక తను తిరిగిచూడలేదు. తనదృష్టి పరిగెత్తే యింజన్ మీదవుంది. ఆఖరిసిగ్నిల్ దాటాక "చూడు వెనక్కి తిరిగి చూడు" అంది. తనుచూసింది : జగన్నాధ్‌కి తను యిచ్చిన పట్టుగిళ్ళ రుమ్మాలు గాలిలో వూగుతోంది.

ఆనాటినుంచీ రుక్మిణమ్మకు ఎవరికోసమూ బాధ పడాల్సిన అవసరం రాలేదు.

పెద్దలు చేసిన పెండ్లయినా భర్త ఆమెను అపురూపదంగా చూశే వాడు. ఆమె రైళ్ళకు వస్తున్నా, వెళ్తున్నా పడిగాపులుపడి ఆహ్వానించేందుకూ, పంపేందుకూ నవ్వు మొహంతో హాజరుగా వుండేవాడు.

కానుపు ఆలస్యంగా వచ్చినా పుట్టిన ఒక్క చిట్టిని వొదిలి ఈనాటి దాకా ఎప్పుడూ ఉండలేదు.

అనారోగ్యంగా వున్నా భర్త బహు ప్రేమగా, జాగ్రత్తగా సేవ జేశాడు. ఈనాటిదాకా అందరూ తనని ప్రేమించడమేగాని—తను మరొకళ్ళ కోసం బాధపడి ఎరగదు.

శానిటోరియమ్‌లో జేరింది. మూడు నెలలబాటుంటే చాలన్నారు. పసివాడు చిట్టి తన పక్కనుండటం మంచిదికాదని, అడయారు స్కూలికి పంపుతున్నారు. భర్తకు శలవు లేమికనక వుద్యోగంలో చేరేందుకు వెళుతున్నాడు. అయినా అతని ప్రాణాలు భార్యమీదనే వుంటాయి ఎల్లప్పుడూ.

ఎటొచ్చీ చిట్టి. వాడిదృష్టిచూడబోయే కొత్త ప్రపంచంమీద ఉంది. ఎవరూ తన హృదయంలో పొడవలేని బాకుతో పసివాడు చిటిపొడిశాడు. పాపం! జగన్నాథ్ ఎంత బాధపడి ఆమాటలు అని ఉంటాడో! పాపిష్టిది. తను అతన్ని అర్థంచేసుకోలేకపోయింది. కన్నీళ్ళు చెక్కిళ్లమీదుగా జారుతున్నాయి.

శానిటోరియమ్ గేట్లలోపల బండి ఆగింది. బండి దిగాక నర్సొచ్చి "వేపచెట్టునీడలో వాలుకుర్చీ వేశాను. పక్కనే పూలూ, సూదులూ వుంచాను. గుడ్డూ పాలూ తెస్తా పదండి" అంటోంది.

కుర్చీలో కూచుంది. ఇంకా జ్ఞాపకం వస్తూనేవున్నాడు. అతన్ని ఎలా బాధించిందో! ఆగకుండా కన్నీళ్ళొస్తున్నాయి.

ఛీ-ఎందుకీ కన్నీళ్ళు. ఎప్పుడో రెండుదశల కిందటి సంగతి తల్చుకు యిప్పుడా! అతనెవరో-తను ఎవరో. చిట్టికోసమా ఈ కన్నీళ్లు, జగనాథ్ కోసమా?

పాపం చిట్టికి స్వెటర్ అల్లి మళ్లీ శుక్రవారం ఆయనకివ్వాలి. అల్లిక సూదులు వూలుని గబగబ తప్పుతున్నాయి.

